ఉత్సాహంగా ప్రతిబింబ్-2024


విద్యార్థుల సాంస్కృతిక నృత్యం

బంజారాహిల్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలతో అలరించారు. మాదాపూర్‌లోని మెరిడియన్ స్కూల్‌లో శనివారం స్పాహి ప్రతిబింబ్-2024 పేరిట జరిగిన వేడుకలు అంబరాన్నంటాయి. ఈ కాంపిటీషన్‌లో నగరంలోని 51 పాఠశాలలకు చెందిన సుమారు 3,000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇండోర్‌గేమ్స్, సంగీతం, డాన్స్, సైన్స్, ఫ్యాషన్ షో, చిత్రలేఖనం, నాటకాలు తదితర విభాగాల్లో విద్యార్థులు పోటీపడ్డారు. విభిన్న రకాల వేషధారణలతో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు విద్యాసంస్థల ఫౌండర్ బుట్టా రేణుక తెలిపారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు వివిధ విభాగాల్లో వారి వారి ప్రతిభను ప్రదర్శించారని వారు వెల్లడించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో మెరిడియన్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.భవాని పాల్గొన్నారు.

చేనేతకారులను మరింత ప్రోత్సహించాలి

మిస్ యూనివర్స్ ఏపీ ఫస్ట్ రన్నరప్ వాణీ విదేహ


ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న వాణీ విదేహ

బంజారాహిల్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన హ్యాండ్‌లూమ్ ఇండియా చేనేత వస్త్ర ప్రదర్శనను శనివారం మిస్ యూనివర్స్ ఆంధ్ర ప్రదేశ్ ఫస్ట్ రన్నరప్-2024 వాణీ విదేహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్ లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. నేటితరం యువత కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ దేశంలోని 14 రాష్ట్రాల నుంచి 75వేల రకాల వస్త్రోఉత్పత్తులను అందుబాటులో ఉంచామని వివరించారు. ఈనెల 29 వరకు ప్రదర్శన కొనసాగుతుందని చెప్పారు.

ఫ్యాషన్ డిజైనర్ల కోసం సరికొత్త యాప్


యాప్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

బంజారాహిల్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ డిజైనర్ల సమయం, ఖర్చు ఆదా చేయడంతో పాటు కొత్త ఆలోచనలను పంచుకునేందుకు టైలర్ ట్రిక్స్ పేరిట సరికొత్త యాప్ అందుబాటులోకి వచ్చింది. ఈ యాప్‌ను, అందుకు సంబంధించిన బ్రోచర్‌ను శనివారం జూబ్లీహిల్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్ శివ సుబ్రహ్మణ్యం, లైఫ్ కోచ్ రమారవి, వియ్ హబ్ చైర్మన్ రమాదేవి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయేన్సర్ నాగశ్రీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'టైలర్‌ట్రిక్స్' చైర్మన్ లావణ్య మాట్లాడుతూ ఈ యాప్‌లో దుస్తుల డిజైనింగ్‌ను, వాటి కటింగ్, లైనింగ్‌ను సులువుగా చేసుకోవచ్చన్నారు. అవసరమైతే కటింగ్, స్టిచింగ్ వంటి సేవలను కూడా ఈ యాప్ ద్వారా అందించనున్నట్లు చెప్పారు. సాంకేతిక నిపుణులు, డిజైనర్ల పర్యవేక్షణలో ఈ యాప్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు.

ప్రారంభమైన ఎప్‌సెట్ రెండోవిడత కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్(బీటెక్) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎప్‌సెట్ రెండోవిడత కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న సుమారు 1,500 అభ్యర్థులు నగరంలో ఏర్పాటు చేసిన ఆరు హెల్ప్‌లైన్ కేంద్రాల్లో తమ ధ్రువపత్రాల పరిశీలనను పూర్తి చేసుకున్నారు. రెండోవిడతలో మరో 10వేలకు పైగా కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో కొత్తగా సీట్లను ప్రభుత్వం పెంచడంతో సీఎస్‌ఈ సీట్ల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసుకున్న అభ్యర్థులు తాము కోరుకున్న కాలేజీల్లో, తమకు నచ్చిన కోర్సును ఎంచుకునేందుకు ఆదివారంతో గడువు ముగుస్తుందని అధికారులు తెలిపారు. ఈ నెల 31న ప్రొవిజనల్ సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

పండిట్, పీఈటీలకు ప్రమోషన్లు కల్పించాలి

ఖైరతాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి, ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ టీచర్లు ధర్నా నిర్వహించారు. శనివారం సైఫాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ ఎదుట తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా టీఎస్ టీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ మాట్లాడుతూ పోస్టుల అప్‌గ్రేడ్‌కు పీఆర్సీ కమిటీ సర్క్యులర్‌తో ముడిపెట్టి అప్‌గ్రేడ్ ప్రక్రియను ఆపొద్దని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ తమకు తీవ్రఅన్యాయానికి గురిచేశాయని, సీఎం రేవంత్‌రెడ్డి, తమకు న్యాయం చేస్తారనే నమ్మకంతో ఉన్నామని పేర్కొన్నారు. అనంతరం తమ డిమాండ్ల వినతి పత్రాన్ని కార్యాలయంలో అధికారులకు అందజేశారు.

బ్రెయిన్ డెడ్ యువకుడి అవయవాల సేకరణ


అద్దంకి రాజా

సనత్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌డెడ్‌కు గురైన ఓ యువకుడి నుంచి అవయవాలను జీవన్‌దాన్ సభ్యులు సేకరించారు. సికింద్రాబాద్ భూదేవినగర్‌కు చెందిన అద్దంకి రాజా(24) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఈనెల 19 బైకుపై వెళుతున్న రాజా కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్ కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు రాజాను 8 రోజుల పాటు ఐసీయూలో చికిత్సను అందించారు. చికిత్సకు స్పందించకపోవడంతో బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. జీవన్‌దాన్ సభ్యులు రాజా కుటుంబ సభ్యులకు అవయవదానం గురించి అవగాహన కలిగించారు. వారి అనుమతితో లివర్, కిడ్నీలను సేకరించారు.

కొటక్ మహీంద్ర బ్యాంకు పేరుతో మోసం

యూసుఫ్‌గూడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కోటక్ మహీంద్రా బ్యాంకు వినియోగదారుడి క్రెడిట్ కార్డు నుంచి నగదు మోసం చేశారని మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్ ఎస్పీఆర్‌హిల్స్ ప్రాంతానికి చెందిన ఎ.ప్రకాష్‌గౌడ్ ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. కొద్ది రోజుల కిందట ఓ వ్యక్తి అతనికి ఫోన్‌చేసి 'మీకు అమీర్‌పేట కొటక్ మహీంద్రా బ్యాంకులో ఎకౌంట్ ఉందా' అని అడిగాడు. ప్రకాష్‌గౌడ్ అవునని సమాధానం ఇచ్చాడు. అంతే ఓటీపీలు ఏమీ చెప్పలేదు, ఎలాంటి లింక్‌లూ ఓపెన్ చేయ్యలేదు. అయినా తన క్రెడిట్ కార్డు నుంచి 12వేలు డెబిట్ అయ్యాయి. దీంతో బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రుణం తీసుకున్న మహిళను వేధిస్తున్న నకిలీ ఉద్యోగి

యూసుఫ్‌గూడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులో రుణం తీసుకున్న ఓ మహిళను ఆ బ్యాంకులో ఉద్యోగం చేసి మానేసిన ఓ వ్యక్తి వేధిస్తున్నాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్ ఎస్పీఆర్ హిల్స్‌లో నివాసం ఉండే మహిళ గతంలో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ ఇండస్ ఇండ్ బ్యాంక్‌లో రూ.4లక్షల రుణం తీసుకుంది. ఆ తరువాత ఆమె ఉద్యోగం పోవడంతో ఈఎంఐలు సరిగ్గా కట్టలేకపోయింది. అయితే గణేష్ పేరుతో ఓ వ్యక్తి ఈఎంఐలు కట్టడం లేదని సదరు మహిళకు ఫోన్‌చేసి వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆమె రూ.15,300 అతనికి ఫోన్‌పేచేసింది. ఆ డబ్బులు బ్యాంకులో కట్టకుండా ఇంకా వేధిస్తున్నాడు. అనుమానం వచ్చి బ్యాంకులో విచారించగా అతని ఫోన్ నంబర్ చూసి ఇతను గణేష్ కాదని ఇతని పేరు నవీన్‌కుమార్ అని ప్రస్తుతం అతను తమ బ్యాంకులో పనిచేయడం లేదని, మోసగాడని బ్యాంకు సిబ్బంది తెలిపారు. దీంతో ఆ మహిళ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు బోనాలు

ముస్తాబైన అమ్మవారి ఆలయాలు

నేడు జరిగే బోనాల ఉత్సవాలకు జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలన్నీ విద్యుత్‌దీపాలతో కళకళలాడుతున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.


బేగంపేటలోని శ్రీకట్టమైసమ్మ ఆలయ గోపురం

బేగంపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మి, బల్కంపేటలోని ఎల్లమ్మ ఆలయాలు బోనాలకు ముస్తాబయ్యాయి. అన్ని ఏర్పాట్లనూ అధికారులు పూర్తిచేశారు. ప్రధానంగా బోనంతో వచ్చే మహిళలను నేరుగా అమ్మవారి వద్దకు పంపే విధంగా ఏర్పాట్లు చేసినట్లు కట్టమైసమ్మ ఆలయ సిబ్బంది, ఆలయ ఫౌండర్ చెక్కల సుభాష్, ఈవో అంబుజలు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునే భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు పొన్నం ప్రభాకర్, దామెదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు తలసాని, పద్మారావు, కృష్ణారావుతో పాటు పలువురికి బోనాల ఆహ్వానాలను అందజేసినట్లు తెలిపారు.


బల్కంపేట ఎల్లమ్మతల్లి మూల విరాట్


కొలువైన శ్రీకట్టమైసమ్మ అమ్మవారు

బల్కంపేటలో పకడ్బందీగా ఏర్పాట్లు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి బోనాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు సకల ఏర్పాట్లు చేశారు. ఇటీవల జరిగిన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం సందర్భంగా జరిగిన తోపులాటను దృష్టిలో పెట్టుకుని అదనపు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఈ పర్వదిన వేడుకలను పురస్కరించుకుని ఆలయం లోపల, బయట ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుత్‌దీపాల వెలుగులు ఆకట్టుకుంటున్నాయి. బోనాల వేడుకల సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అమీర్‌పేట డివిజన్‌లోని సోనబాయమ్మ ఆలయం, బల్కంపేటలోని ఉజ్జయిని మహాకాళీ ఆలయం, బీకేగూడలోని పోచమ్మ ఆలయం, అమీర్‌పేటలోని కనకదుర్గా ఆలయం, ఎస్ఆర్‌నగర్ ఎస్సాఆర్‌టీ కాలనీలోని పోచమ్మ ఆలయం, బాపూనగర్‌లోని అమ్మవారి ఆలయం, ఈఎస్ఐ ఆస్పత్రిలో కొలువైన బంగారు మైసమ్మ ఆలయం, సనత్‌నగర్‌లోని హనుమాన్ ఆలయం, సుందర్ నగర్‌లోని పోచమ్మ ఆలయం, తదితర ఆలయాల వద్ద ఎస్ఆర్‌నగర్ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.


శ్రీభూలక్ష్మి దేవాలయంలో జరిగిన అమ్మవారి ఘటాల ఊరేగింపులో ఆలయ ఫౌండర్ విశాల్ సూథం దంపతులు


బోరబండలో పర్యటిస్తున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, ఏసీపీ వెంకటరమణ

● ఖైరతాబాద్: బోనాల వేడుకలకు అమ్మవార్ల దేవాలయాలు సిద్ధమయ్యాయి. ఖైరతాబాద్‌లోని ఏడు గుళ్ల దేవాలయం, మహాకాళి దేవాలయం, గజ్జెలమ్మ దేవాలయం, నల్లపోచమ్మ దేవాలయం, వెంకటలక్ష్మమ్మ దేవాలయం, రేణుకానాగలక్ష్మి దేవాలయం తదితర ఆలయాలను విద్యుత్ కాంతులతో పాటు రకరకాల పూలతో ముస్తాబు చేశారు. విద్యుత్ వెలుగులతో ఆలయాలన్నీ కళకళలాడుతున్నాయి. మరోవైపు ఆలయాలకు బోనాలతో వచ్చే భక్తులతోపాటు పూజల కోసం వచ్చే వీఐపీలు, ఇతర భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రతి ఆలయం వద్ద పోలీసులతోపాటు మహిళా సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నట్లు ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.


సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలో జరిగే బోనాల వేడుకలకు ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌ను ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ఆర్‌బీ.నరేష్, తదితరులు

బస్తీల్లో కార్పొరేటర్, ఏసీపీ పర్యటన

బోరబండ: అమ్మవారి ఆలయాల వద్ద భక్తులకు అన్ని సౌకర్యాలూ కల్పించాలని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. శనివారం బోరబండలోని వివిధ బస్తీల్లో అమ్మవారి ఆలయలను ఏసీపీ వెంకటరమణతో కలిసి కార్పొరేటర్ సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాలకు పట్టువస్త్రాలను సమర్పించి, పూజాసామగ్రిని ఆలయ కమిటీలకు అందజేశారు. నేడు జరిగే బోనాలకు బోరబండకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తోపాటు పలువురు మంత్రులు హాజరై ప్రత్యేక పూజాలు చేస్తారన్నారు. ఈ పర్యటనలో సీఐ ఎస్వీ శేఖర్, ట్రాఫిక్ పోలీసులతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణపై మహిళల్లో అవగాహన

ఎఫ్‌పీఏ ఇండియా హైదరాబాద్ బ్రాంచ్ చైర్మన్ డా.ప్రభావతి

బేగంపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): కుటుంబనియంత్రణపై ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌పీఏ ఇండియా) హైదరాబాద్ బ్రాంచ్ చైర్మన్ డా.ప్రభావతి అన్నారు. ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వార్షికోత్సవం సందర్భంగా శనివారం పంజాగుట్టలోని హైదరాబాద్ బ్రాంచ్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ దేశంలో కుటుంబ నియంత్రణ విజయాల్లో ఎఫ్‌పీఏ ఇండియా కీలకపాత్ర పోషించిందన్నారు. ఈ సమావేశంలో జీఎం రేణు, డా.జమున పాల్గొన్నారు.

పోచమ్మ విజయదుర్గాదేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా లక్ష్మీయాదవ్

బంజారాహిల్స్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిగూడ పోచమ్మ విజయదుర్గాదేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా గొంటి లక్ష్మీయాదవ్ నియమితులయ్యారు. సభ్యులుగా తొండపు శైలజ, దుబ్బ వరలక్ష్మి, ఏతరి నారాయణ, చెన్నోజి శ్రీనివాస్, ఆడల వీరస్వామి ఎన్నికయ్యారు. శనివారం ఆలయంలో సభ్యులంతా సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వనం శ్రీనివాస్‌యాదవ్. శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


వేడుకలను ప్రారంభిస్తున్న ఎన్ఆర్ఎస్‌సీ డైరెక్టర్ డా.ప్రకాష్‌చౌహాన్

రాష్ట్రపతి నిలయంలో ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

తిరుమలగిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సామాన్య మానవుని జీవితంలో అంతరిక్ష సాంకేతికత పాత్రకు ఎంతో ఆవశ్యకత ఉందని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్సీ) డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్ అన్నారు. శనివారం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆయన జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఉపగ్రహాల ద్వారా ప్రదేశాన్ని ట్రాక్ చేయడం, గ్లోబల్ నావిగేషన్ సపోర్ట్ సిస్టమ్ శాటిలైట్ సర్వర్ల ద్వారా ఏటీఎంల పనితీరును ఉపగ్రహాలు మనకి అందిస్తుండడం గురించి చౌహాన్ వివరించారు. మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ కె.రజినీప్రియ అబ్దుల్ కలామ్‌ను స్మరించుకున్నారు. రాష్ట్రపతి నిలయంలో పాఠశాల విద్యార్థుల కోసం ఔట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు ఎన్ఆర్ఎస్సీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు తమ పెయింటింగ్‌ల ద్వారా తమ ప్రతిభను కనబరిచారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అసిస్టెంట్ కమిషనర్ క్రిష్ణవేణి పాల్గొన్నారు.


సీఎం కాన్వాయ్ విధులు నిర్వహిస్తుండగా దొరికిన మొబైల్ ఫోన్‌ను ఏసీపీ కట్టా హరిప్రసాద్ సమక్షంలో పోగొట్టుకున్న మహిళకు అందజేస్తున్న పంజాగుట్ట ట్రాఫిక్ ఎస్ఐ మొబీరాం
- బంజారాహిల్స్, జూలై 27

చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు రావాలి

హ్యాండ్లూమ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్


ఉత్పత్తులను పరిశీలిస్తున్న శైలజా రామయ్యర్

బంజారాహిల్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చేనేత ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని హ్యాండ్లూమ్, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ అన్నారు. శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో శనివారం ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటుచేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఉత్పత్తులను తిలకించి, చేనేతకారులను అభినందించారు. తెలంగాణ ప్రభుత్వం చేనేతకళాకారులను మరింత ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 80స్టాళ్లలో ఏర్పాటుచేసినట్లు సిల్క్ ఇండియా సీఈఓ వినయ్ కుమర్ తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రతినిధి ఇందిర గుమ్మిల, టూరిజం రాష్ట్ర ప్రతినిధులు పాల్గొన్నారు. ఆగష్టు 5 వరకూ ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు.

కొత్త టెక్నాలజీలపై అవగాహన ఉండాలి

సైబర్ సెక్యూరిటీ సీఈఓ బిరదవోలు శ్రీరామ్


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న శ్రీరామ్ బిరదవోలు

బంజారాహిల్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో సైబర్ సెక్యూరిటీకి మంచి డిమాండ్ ఉందని బీటెక్ చదవడంతో పాటు విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ వైపు కూడా ఆలోచిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని సైబర్ సెక్యూరిటీ సీఈవో శ్రీరామ్ బిరదవోలు అన్నారు. బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజనీరింగ్‌కాలేజీలో శనివారం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌తో పాటు వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీరామ్ బిరదవోలు మాట్లాడుతూ రానున్న కాలంలో సైబర్ సెక్యూరిటీలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, విద్యార్థులు వినూత్నంగా ఆలోచించడంతో పాటు సరికొత్త టెక్నాలజీలు నేర్చుకునేందుకు ఆసక్తి చూపాలని సూచించారు. ఎక్కడ హ్యాకథాన్‌లో నిర్వహించినా, ఎక్కడ వర్క్‌షాప్‌లు పెట్టినా వాటిని సందర్శించాలని, కొత్త విషయాలు నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవకార్యదర్శి జాఫర్ జావెద్, సీఎస్ఈ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ సయీద్ షబ్బీర్ అహ్మద్, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ మహిపాల్‌సింగ్ రావత్, రిజిస్ట్రార్ నర్సింహారావు పాల్గొన్నారు.


విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న ఎస్సై షేక్ నాగుల్‌మీరా

మత్తు పదార్థాలను తరిమికొడదాం

యూసుఫ్‌గూడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్ నిర్మించాల్సిన యువతరం మత్తు పదార్థాలు, డగ్స్‌కు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటోందని, అలాంటి మత్తు పదార్థాలను సమాజం నుంచి తరిమికొట్టేందుకు ప్రతి పౌరుడూ బాధ్యత తీసుకోవాలని బోరబండ ఎస్సై షేక్‌నాగుల్ మీరా అన్నారు. శనివారం శ్రీరామ్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం- సమాజాన్ని మేలుకొలుపుదాం' అనే అంశంపై అవగాహన ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు శారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రమాణం చేయించారు. ప్రధానోపాధ్యాయులు కాంతయ్య, ప్రజానాట్య మండలి నగర ఉపాధ్యక్షులు టి.రఘు, ఆహ్వానసంఘం ప్రధానకార్యదర్శి మారన్న, నగర ఉపాధ్యక్షులు వసియుద్దీన్, పి.సునీత, టి.భరత్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఇందిర, అనిత, కుమారి, శ్రీదేవి, సరిత పాల్గొన్నారు.

సేవాభావాన్ని పెంపొందించుకోవాలి

బేగంపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అందరూ సేవాభావాన్ని పెంపొందించుకోవాలని బీజేపీ నేత, సామాజిక కార్యకర్త కె.మాధవీలత అన్నారు. వివిధ రంగాల్లో విశేషసేవలు అందిస్తున్న పలువురిని గ్లోబల్ పినాకల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియా అలైట్ బ్రాండ్ అవార్డుల ప్రదానోత్సవం కంట్రీక్లబ్‌లో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాధవీలత ముఖ్యఅతిథిగా హాజరై పలు రంగాల్లో సేవలు అందించిన వారికి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవలు చేసే వారికి అవార్డులు, సత్కారాలు రావడంతో వారు మరింత సేవ చేయడానికి వీలు కలుగుతుందన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు రిషిత రూమాల, నచికేత్ రూమాల మాట్లాడుతూ సమాజంలో సామాజిక సేవలను ప్రోత్సహించేందుకు ఈ పురస్కారాలను ఇస్తున్నామన్నారు. ఈ సంవత్సరం ఐటీ, సామాజిక సేవ సంఘాలు, పారిశ్రామిక వేత్తలతోపాటు సుమారు 40 మందికి అవార్డులను అందజేశామన్నారు.


అవార్డులు అందుకున్న వారితో బీజేపీ నేత మాధవీలత

జనసంచారంలో వీధి కుక్కల కోసం ఆహారం పెట్టవద్దు

బంజారాహిల్స్, జూలై 27(ఆంధ్రజ్యోతి): జనసంచారం ఉన్న చోట వీధి కుక్కల కోసం ఆహారం పెట్టవద్దని జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం డీడీ డాక్టర్ చక్రపాణి సూచించారు. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ హౌసింగ్ కో ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో వీధి కుక్కలపై కాలనీవాసులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ చక్రపాణి మాట్లాడుతూ చాలామంది పార్కుల వద్ద, జనసంచారం ఉండే ప్రాంతాల్లో కుక్కలకు ఆహారాన్ని పెట్టి వెళ్లిపోతున్నారని ఇది మంచి పద్ధతి కాదని సూచించారు. జనాన్ని చూసేసరికి కుక్కల్లో అయోమయం నెలకొని అభద్రతాభావంతో దాడులు చేస్తుంటాయని తెలిపారు. కాలనీలో ఉన్న వీధికుక్కలను స్టెరలైజ్ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ నజ్రీన్, సొసైటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువతి మృతి


సౌమ్య

ఖైరతాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నీళ్ల వేడి చేసుకునేందుకు వాటర్ హీటర్ వాడుతున్న క్రమంలో షాక్‌కు గురై ఓ యువతి మృతిచెందింది. ఎస్సై సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్‌కు చెందిన కె.సౌమ్య(20) ఖైరతాబాద్‌లో అద్దెకు ఉంటూ వాసవీ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. శుక్రవారం రాత్రి వేడినీళ్ల కోసమని వాటర్ హీటర్‌ను బకెట్లో వేస్తుండగా షాక్‌కు గురై పడిపోయింది. ఆమె స్నేహితుడు ప్రశాంత్ ఫోన్‌చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో అనుమానంతో ఆమె ఉంటున్న గది వద్దకు వచ్చి మూసి ఉన్న తలుపులను స్థానికుల సాయంతో తీసి చూడగా సౌమ్య కింద పడి ఉంది. హీటర్ స్విచ్ ఆఫ్ చేసి మరో నర్సు మమత సహాయంతో వాసవీ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కరీంనగర్ నుంచి ఆమె తల్లి భాగ్యలక్ష్మి వచ్చి ఫిర్యాదు చేయడంతో కేసును ఖైరతాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాగులు, పర్సులు, మొబైళ్ల చోరీ

- బోనాల వేడుకల్లో మహిళా దొంగల చేతివాటం
- ఇద్దరు యువతులను అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్

హైదరాబాద్ సిటీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉజ్జయినీ మహాకాళి బోనాల సందర్భంగా ఆలయం వద్ద భక్తుల ఫోన్‌లు, విలువైన వస్తువులను చోరీ చేసిన ఇద్దరు యువతులను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్, మహాకాళి పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. వీరు ఉజ్జయిని మహంకాళి బోనాల సమయంలో ఉజ్జయిని ఆలయం వద్ద పలుమార్లు తచ్చాడుతూ, బోనం తెచ్చిన భక్తుల నుంచి ఫోన్‌లు, పర్సులను చోరీ చేశారు. భక్తురాలి నుంచి ఫిర్యాదు రావడంతో సీసీ కెమెరాలను జల్లెడ పట్టారు. ఆలయం పరిసరాల్లో ఓ మహిళ బ్యాగును చోరీ చేసి అక్కడి నుంచి తప్పించుకున్న వీడియో బయటకు వచ్చింది. అంతేకాకుండా ఫుటేజ్‌లలో ఆలయంలో తిరుగుతూ కనిపించారు. సీసీ ఫుటేజ్‌లతో నిందితుల ఇళ్లను గుర్తించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు మహాకాళి పోలీసుల సహకారంతో ఇద్దరు మహిళా దొంగలను అరెస్ట్ చేశారు. వారిని విచారించగా బోరబండ ప్రాంతానికి చెందిన ఒర్సు సోని(26), ఫతేనగర్‌కు చెందిన వేమల శిరీష(24)గా గుర్తించారు. వీరిద్దరూ కలిసి రద్దీగా ఉండే ప్రదేశాల్లో, దసరా, దీపావళి వేడుకలు, వినాయక నిమజ్జన ఉత్సవాల సమయంలో రద్దీలో తిరుగుతూ మహిళల బ్యాగులు, పర్సులు, ఫోన్‌లు, విలువైన వస్తువులను చోరీచేస్తున్నారని తేలిందని పోలీసులు తెలిపారు. వారి నుంచి చోరీచేసిన హ్యాండ్ బ్యాగుతోపాటు రూ.2లక్షల విలువైన ఏడు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

నేడు బొల్లారంలో బోనాల జాతర



నోవా కేర్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జంపన ప్రతాప్, నారాయణ ఆనంద్

నోవా కేర్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

బోయిన్‌పల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బోయిన్‌పల్లి పట్టణంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం బోయిన్‌పల్లిలోని న్యూసిటీ కాలనీలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నోవాకేర్ ఆస్పత్రి సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ అధ్యక్షుడు నారాయణ, నోవాకేర్ ఆస్పత్రి ఏఓ ఆనంద్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆలయ దర్శనం కోసం వచ్చిన రోగులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బోయిన్‌పల్లి ప్రాంతంలో స్థిరపడిన వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 100మందికి పైగా రోగులు వైద్యసేవలు పొందారు. కాగా సుమారు 95 మంది బీపీ, షుగర్, ఈసీజీ, టుడీఈకో వంటి పరీక్షలను వైద్య నిపుణులు చేశారు. రోగులకు పలు సూచనలు, సలహాలను వైద్యులు ఇచ్చారు. పలువురు నిరుపేదలకు ఉచితంగా మందులు కొనుగోలు చేయడానికి టోకెన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు సుందర్, దివ్య, అలయ్ కమిటీ సభ్యులు లక్ష్మణ్, దుర్గయ్య, సాంబశివరావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



మార్షల్ ఆఫ్ ది ఏర్ అర్జున్‌సింగ్ ఆడిటోరియం ప్రారంభిస్తున్న ఏర్ కమొడోర్ పంకజ్

మార్షల్ ఆఫ్ ది ఏర్ అర్జున్‌సింగ్ ఆడిటోరియం ప్రారంభం

తిరుమలగిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి లాల్‌బజార్‌లోని పల్లవి మోడల్ స్కూల్‌లో శనివారం మార్షల్ ఆఫ్ ది ఏర్ అర్జున్‌సింగ్ పేరుతో ఏర్పాటు చేసిన ఆడిటోరియంను ఏర్ కమొడోర్ పంకజ్ ప్రారంభించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో గ్రూప్ కెప్టెన్ నరేంద్రవర్మ, కెప్టెన్ దీపక్‌గౌడ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ అమన్ కుమార్‌లు పాల్గొన్నారు. విద్యార్థులు అంకితభావంతో అద్భుతమైన విజయాన్ని సాధించాలని సూచించారు. పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సాగర్ పాల్గొన్నారు.



టైప్ రైటింగ్ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రశాంతంగా ముగిసిన టైప్ రైటింగ్ పరీక్షలు

మారేడుపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ తెలంగాణ హైదరాబాద్ సంవత్సరానికి రెండు పర్యాయాలు ఎస్.బి టెట్ ద్వారా నిర్వహిస్తున్న టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలు నిర్వహిస్తుందని తెలంగాణ రిక్వైనిడేడ్ టైప్ రైటింగ్ కంప్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష బాలిగ వెల్లడించారు. మారేడుపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న టైప్ రైటింగ్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం 21న మిగిలిన నాలుగు బ్యాచ్‌లు వర్షాల కారాణంగా వాయిదా వేయడం జరిగింది. ఎస్.బి. టెట్ అధికారులు తిరిగి ఆదివారం ఈనెల 27న నిర్వహిస్తుందని ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ బాషల్లో లోయర్, హయ్యర్ గ్రేడ్, హైస్పీడ్ పరీక్షలను నిర్వహిస్తుందని తెలిపారు. రాబోయే రాష్ట్ర జాబ్ క్యాలెండర్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ లాంటి పోటీ పరీక్షలకు, కోర్టుల్లో జరిపే టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ నియామకాల్లో ఇటువంటి స్కిల్ ఉద్యోగార్థులకు బాగా ఉపయోగపడుతుందని, ఎస్.బి టెట్ ద్వారా వృత్తి నైపుణ్య శిక్షణలో పొందిన ధృవపత్రాలను నిరుద్యోగులు వారి ప్రొఫైల్‌కు అదనపు అర్హతగా ఉపయోగించుకోవచ్చునని, అదేవిధంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఆయన సూచించారు.

గుంతలమయంగా జేబీఎస్ ప్రధాన రహదారి

మారేడుపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని జిల్లాలకు, తమ గ్రామాలకు పికెట్ జూబ్లీబస్ స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రమాదకరంగా మారిన పరసర ప్రాంతాల రోడ్లను చూసి భయాందోళన చెందుతున్నారు. జేబీఎస్‌లోనికి, బయటకి వెళ్లే ప్రధాన రహదారుల్లో భారీ గుంతలు ఏర్పడి ఉన్నాయి. పాదచారులు సైతం రోడ్లపై నడుస్తూ ప్రమాదాల బారిన పడుతున్న దుస్థితి నెలకొంది. దీంతో మారేడుపల్లి ట్రాఫిక్ పోలీసులు తమ సామాజిక సేవను చాటుతూ, గుంతలమయంగా మారిన రోడ్లను మట్టితో పూడ్చడం కనబడింది. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణ సాఫీగా జరగాలని, ప్రయాణికులు ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో పనులు చేపట్టడంతో ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



ప్రమాదకరంగా ఏర్పడిన గుంతల్లో మట్టిని పూడుస్తున్న మారేడుపల్లి ట్రాఫిక్ పోలీసులు



భాదిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ అధ్యక్షుడు గండికోట కుమార్ తదితరులు

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

తార్నాక, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో ఇటీవల అకాల మరణం చెందిన శివరాత్రి అప్పారావుకు శనివారం శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ సభ్యులు సంతాపం ప్రకటించారు. అనంతరం సొసైటీ సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు గండికోట కుమార్ మాట్లాడుతూ శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ ఆధ్వర్యంలో గత ఐదు సంవత్సరాల నుంచి వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నేడు ఆషాఢ మాసం బోనాల జాతర సందర్భంగా బొల్లారంలోని అమ్మవారి దేవాలయాలను నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. బొల్లారంలోని తోట ముత్యాలమ్మ దేవాలయం సదర్ బజార్‌లోని మహాకాళి దేవాలయాలను నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. తోట ముత్యాలమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవ వేడుకల సందర్భంగా ఉదయం 5గంటలకు చండీ యాగం, కుంకుమార్చనలు వంటి ప్రత్యేక పూజలు జరుగుతాయని ప్రధాన అర్చకులు చిక్కాల మహేష్ కుమార్ తెలిపారు. అదేవిధంగా అరుణ్ స్వామి శ్రీ సిద్ధి వినాయక భజన పార్టీ వారిచే భజన కార్యక్రమం సాయంత్రం జరుగుతుందని, ఘటం కార్యక్రమం కూడా కొనసాగుతుందని తెలిపారు. అమ్మవారికి పల్లకి సేవ, శాంతి పూజ, మహానైవేద్యం, దివ్యమంగళ హారతి లాంటి పూజలు జరుగుతాయని తెలిపారు. సోమవారం ఉదయం 5 గంటలకు అభిషేకం, కుంకుమార్చన, నైవేద్యము, మంగళహారతి, పుష్పార్చన లాంటి ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. అదేవిధంగా మంగళవారం 30వ తేదీన మధ్యాహ్నం 1గంట నుంచి 3గంటల వరకు అన్నప్రసాదం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. బోనాల ఉత్సవ వేడుకలకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవాలని చిక్కాల మహేష్ కోరారు.



బోనాల జాతరకు ముస్తాబైన సదర్‌బజార్ మహాకాళి దేవాలయం

సదర్ బజార్ మహాకాళి దేవాలయంలో..

సదర్ బజార్ మహాకాళి అమ్మవారి దేవాలయంలో కూడా బోనాల జాతరకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ప్రతి ఏటా లాగానే నిర్వహించిన బోనాల జాతర లాగానే ఈ సంవత్సరం కూడా ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం గణేషుడికి అభిషేకంతో పూజలు ప్రారంభం అవుతాయి. సోమవారం భవిష్యవాణి వినిపించడానికి పచ్చికుండ దేవాలయానికి తీసుకురావడం, రంగం, బలిగంప, అమ్మవారి ఊరేగింపు ఉంటాయి. రాత్రికి అమ్మవారిని ఊరిపొలిమేరకు సాగనంపుతామని, దీంతో జాతర ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు మారేడుపల్లి బోనాల జాతర ప్రారంభం

మారేడుపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి శ్రీమైసమ్మ అమ్మవారి బోనాల జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు సి.కృష్ణయాదవ్, తిరుమల్, వంశి పూర్తి ఏర్పాట్లు చేశారు.

ఆదివారం తెల్లవారు జాము నుంచే సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి ఆలయానికి విచ్చేసి భక్తులు అమ్మవారికి గాజులు, చీరలు, బోనం సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు. కిలో మీటర్ పొడవునా తగ 15 రోజుల ముందే రోడ్లకు ఇరువైపులా రంగురంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడం, అరుదైన ప్రదేశాలను సూచించే 20 భారీ సుస్వాగతం కమాన్లను ఏర్పాటు చేయడం భక్తులను, ఇటు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది.



మారేడుపల్లి మైసమ్మ అమ్మవారు

ఆలయాల నిర్వాహకులు పోలీస్ నిబంధనలు పాటించాలి : ఏసీపీ సుబ్బయ్య

మారేడుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 33 దేవాలయాల్లో మారేడుపల్లి బోనాల జాతర ఉత్సవాలు జరుపుకునేందుకు అనుమతులు తీసుకున్నారని ఏసీపీ సుబ్బయ్య, మారేడుపల్లి సీఐ వెంకటేష్ తెలిపారు.

బోనాల జాతర బందోబస్తు నిమిత్తం వందమంది పోలీసులు ఆలయ పరిసర ప్రాంతాలను పర్యవేక్షిస్తుంటారని పేర్కొన్నారు. అదేవిధంగా సీసీ కెమేరాల నిఘా ఉంటుందని, శుక్రవారం రాత్రి ఆలయాల నిర్వాహకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో నిర్వాహకులకు సూచనలు, నియమనిబంధనలు తెలియజెప్పారు. ఎస్సై లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి



చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయం జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న దేవాదాయ కమిషనర్ హన్మంతరావు



రైల్వే ఈ టికెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన రైల్వే సీబీఐ ఆర్పీఎఫ్ పోలీసులు

రైల్వే ఈ టికెట్లను విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత ఐడీ పేరుతో టికెట్‌పై అదనంగా వసూలు చేస్తూ రైల్వే ఆదాయానికి గండికొడుతున్న ఓ వ్యక్తిని రైల్వే సీబీఐ, ఆర్పీఎఫ్ రైల్వే అధికారులు పట్టుకున్నారు. నాంపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్, నందినగర్, వెంకటేశ్వర్‌నగర్‌కు చెందిన వర్ద వెంకటేష్(33) గత కొంతకాలంగా రైల్వే ఈ టికెట్లను విక్రయిస్తున్నాడు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో ఒక్కొక్క టికెట్‌కు అదనంగా వంద రూపాయలు తీసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న రైల్వే సీబీఐ అధికారి రవిబాబు, ఆర్పీఎఫ్ త్రీమూర్తులు సంయుక్త ఆధ్వర్యంలో సీబీఐ ఆర్పీఎఫ్ పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి హార్డ్ డిస్క్, ఆధార్ కార్డు, 188 పేజీలు కలిగిన పంచనామ పత్రాలు, నెక్సస్ తత్కాల్ సాఫ్ట్‌వేర్‌తో పాటు ఈ టికెట్లను, ముఖ్యమైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రైల్వే యాక్టు ప్రకారం కేసు నమోదు చేసి నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులకు అప్పగించారు.

బ్యాగులు, పర్సులు, మొబైళ్లు చోరీ

- బోనాల వేడుకల్లో మహిళా దొంగల చేతివాటం
- ఇద్దరు యువతులను అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్

హైదరాబాద్ సిటీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉజ్జయినీ మహాకాళి బోనాల సందర్భంగా ఆలయం వద్ద భక్తుల ఫోన్‌లు, విలువైన వస్తువులు చోరీ చేస్తున్న ఇద్దరు యువతులను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్, మహాకాళి పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. బోరబండ ప్రాంతానికి చెందిన ఒర్సు సోని(26), ఫతేనగర్‌కు చెందిన వేమల శిరీష (24)లు చిన్నచిన్న చోరీలు చేస్తున్నారు. వీరిద్దరూ కలిసి రద్దీగా ఉండే ప్రదేశాల్లో తిరుగుతూ చోరీలు చేస్తున్నారు.

దసరా, దీపావళి వేడుకలు, వినాయక నిమజ్జన ఉత్సవాల సమయంలో రద్దీలో తిరుగుతూ మహిళల బ్యాగులు, పర్సులు, ఫోన్‌లు, విలువైన వస్తువులు చోరీ చేస్తున్నారు. వీరు ఉజ్జయినీ మహాకాళి బోనాల సమయంలో ఉజ్జయినీ ఆలయం వద్ద పలుమార్లు తచ్చాడుతూ, బోనం తెచ్చిన భక్తుల నుంచి ఫోన్‌లు, పర్సులు, చోరీ చేశారు. భక్తురాలి నుంచి ఫిర్యాదు రావడంతో సీసీ కెమెరాలను జల్లెడ పట్టారు. ఆలయం పరిసరాల్లో ఓ మహిళ బ్యాగును చోరీ చేసి అక్కడి నుంచి తప్పించుకున్న వీడియో బయటకు వచ్చింది. అంతేకాకుండా ఫుటేజీలలో ఆలయంలో తిరుగుతూ కనిపించారు. సీసీ ఫుటేజ్‌లతో నిందితుల ఇళ్లను గుర్తించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు మహాకాళి పోలీసుల సహకారంతో ఇద్దరు మహిళా దొంగలను అరెస్ట్ చేశారు. వారి నుంచి చోరీ చేసిన హ్యాండ్ బ్యాగుతోపాటు రూ.2లక్షల విలువైన ఏడు ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

- జాజుల లింగం గౌడ్

తార్నాక, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. ఈ మేరకు శనివారం తార్నాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కులాలవారీగా జనాభాను లెక్కించడంతో పాటు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచకుండా ఆగస్టు నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం ఎంతవరకు సమంజసమని తీవ్రంగా మండిపడ్డారు. బీసీల కులగణన చేయకుండా, రిజర్వేషన్లను పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో

భారత్‌లో సేవా కార్యక్రమాలు

రవీంద్రభారతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో భారతదేశంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ లయన్ ఫబ్రిసియో తెలిపారు. శనివారం రవీంద్రభారతిలో 'ఎండీ గ్యాట్ కాంక్లేవ్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఫబ్రిసియో మాట్లాడుతూ హైదరాబాద్ వేదికగా లయన్స్ క్లబ్‌లు చురుకుగా పనిచేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా బాలానగర్ ఎలైట్ జడ్‌సీ గురించి ప్రస్తావిస్తూ నగరంతోపాటు ఆయా జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, లయన్ సుబ్రహ్మణ్యం నిర్వహించే ఆయా కార్యక్రమాల్లో తాను పాల్గొంటానని తెలిపారు. లయన్ ఫబ్రిసియోను బాలానగర్ ఎలైట్ జెడ్‌సీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబూరావు, సునిల్‌కుమార్, దీపక్ భట్టాచార్య, ఎస్ఎస్.రెడ్డి, ప్రకాష్‌రావు, రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్, మురళీధర్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



లయన్ ఫబ్రిసియోను సత్కరిస్తున్న అతిథులు

ఆషాఢమాస జాతరకు భారీబందోబస్తు

బౌద్ధనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ డివిజన్ ఏసీపీ కార్యాలయం పరిధిలో ఆది, సోమవారం జరిగే ఆషాఢ బోనాల జాతరకు భారీ బందోబస్తును ఏర్పాటు చేశామని ఏసీపీ జైపాల్‌రెడ్డి తెలిపారు. చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 130మంది, వారాసిగూడ పీఎస్ పరిధిలో 60మంది, లాలాగూడ పీఎస్ పరిధిలో 65మంది పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. డివిజన్ పరిధిలో 55 ఆలయాల వద్ద జాతర జరుగుతుందన్నారు. ముఖ్యంగా ప్రధాన ఆలయమైన చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయం వద్ద ఎక్కువమంది బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. బోనాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. జాతర జరిగే ఆలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఇన్‌స్పెక్టర్లు అనుదీప్(చిలకలగూడ), సైదులు(వారాసిగూడ), కరుణాకర్‌రెడ్డి(లాలాగూడ) పర్యవేక్షణలో నిఘాను ఉంచుతామని తెలిపారు.



ఏసీపీ జైపాల్‌రెడ్డి



ఘటంకు ప్రత్యేక పూజలు చేసిన మాజీ బోర్డు సభ్యురాలు ప్యారసాని భాగ్యశ్రీ

వైభవంగా ముగిసిన బోనాల జాతర

తిరుమలగిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి పెద్ద కమేలలోని ఎల్లమ్మ, నల్ల పోచమ్మ దేవాలయాల బోనాల జాతర అంగరంగ వైభవంగా ముగిసింది. రెండు రోజులపాటు జరిగిన బోనాల జాతరకు మహిళా భక్తులు తమ తమ బోనాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. సాక పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. దేవాలయాలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. పోతరాజుల వీరంగం శివసత్తుల పూనకాలు, డప్పుల దరువులతో భక్తులతో దేవాలయాలు కిటకిటలాడాయి. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యురాలు ప్యారసాని భాగ్యశ్రీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రుక్మయ్య, బీఆర్ఎస్ పార్టీ వార్డ్-7 ఉపాధ్యక్షుడు యశ్వంత్ కుమార్, సుదర్శన్, రవి, శ్రీనివాస్, అనిల్, వినోద్, లక్ష్మీపతి, రాకేష్, రాకేష్‌లు పాల్గొన్నారు.



ఆలయచైర్మన్, ధర్మకర్తమండలి సభ్యులను సత్కరిస్తున్న లష్కర్ జిల్లా సాధనసమితి చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్

నూతన ఆలయ చైర్మన్, ధర్మకర్త మండలి సభ్యులకు సత్కారం

బౌద్ధనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయ నూతన చైర్మన్‌గా నియమితులైన డి.చందర్‌ను, ధర్మకర్తలమండలి సభ్యులను శనివారం ఆలయంలో లష్కర్ జిల్లా సాధన సమితి చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ సత్కరించారు. చైర్మన్ చందర్, ధర్మకర్తలమండలి సభ్యులు కైలాస్ అరుణ్‌కుమార్, నరేష్, నవీన్‌కుమార్, హేమలతకు శాలువా కప్పి పూలదండలు వేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్, నాయకులు జలంధర్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పీడీ పోస్టులను మంజూరు చేయాలి

సీఎంకు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం వినతి

హైదరాబాద్ సిటీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 1,670 ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్(పీడీ) పోస్టులను మంజూరు చేయాలని వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తిగౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీ ఆవరణలో అశ్వరావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తిగౌడ్ మాట్లాడుతూ ఇటీవల చేపట్టిన పదోన్నతుల్లో 2వేల మంది పీఈటీలను ఫిజికల్ డైరెక్టర్లుగా నియమించడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలోని అన్ని అప్పర్ ప్రైమరీ స్కూళ్ల(యూపీఎస్)లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ) పోస్టులను మంజూరు చేసి ప్రత్యేకంగా డీఎస్సీ నిర్వహించాలని కోరారు. అలాగే ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో 300పైగా ఉన్న పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు కె.వెంకటనారాయణ రామారావు, రవి, బాబురావు, అశోక్, పద్మజ, నాగలక్ష్మి, పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు



వేడుకలను ప్రారంభిస్తున్న నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్

తిరుమలగిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సామాన్య మానవుని జీవితంలో అంతరిక్ష సాంకేతికత పాత్రకు ఎంతో ఆవశ్యకత ఉందని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్ అన్నారు. శనివారం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆయన జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఉపగ్రహాల ద్వారా ప్రదేశాన్ని ట్రాక్ చేయడం గ్లోబల్ నావిగేషన్ సపోర్ట్ సిస్టమ్ శాటిలైట్ సర్వర్ల ద్వారా ఏటీఎంల పనితీరును ఉపగ్రహాలు మనకి అందిస్తున్నాయని చౌహాన్ అన్నారు. వాతావరణ ఉపగ్రహాల ద్వారా వాతావరణ నివేదికలు, వాటి అంచనా రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల ద్వారా తుఫాన్‌ల, ఉష్ణోగ్రతను తెలియజేస్తున్నాయన్నారు. వైఫల్యాలు సాంకేతిక లోపాల గురించి ఆందోళన చెందకుండా లక్ష్యాలను సాధించడానికి విద్యార్థులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇస్రో భవిష్యత్ ఆవిష్కరణలు ప్రాజెక్టుల గురించి కూడా ఆయన విద్యార్థులకు వివరించారు. మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ కే.రజినీప్రియ అబ్దుల్ కలామ్‌ను స్మరించుకున్నారు. రాష్ట్రపతి నిలయంలో పాఠశాల విద్యార్థుల కోసం ఔట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు ఎన్ఆర్ఎస్‌సీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు తమ పెయింటింగ్‌ల ద్వారా ప్రతిభను కనబరిచారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అసిస్టెంట్ కమిషనర్ క్రిష్ణవేణి పాల్గొన్నారు.